క్లుప్తంగా

శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు



అన్నదాన కార్యక్రమంలో తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

కె.గంగవరం: స్థానిక వైష్ణవి కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలను కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా ఆలయం వద్ద వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి



ఉండూరులో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతులు సెప్టెంబర్ 15 లోపు ఈ-పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ సూచించారు. ఉండూరు రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. వెబ్ లాగిన్ పనితీరును తనిఖీ చేశారు. ఈ పంట నమోదు సక్రమంగా పనిచేస్తుందన్నారు. రైతులంతా ప్రభుత్వం నుంచి రాయితీలు, సహకారం పొందాలంటే తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కపిలేశ్వరపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక మండల పరిషత్ వైఎస్సార్ సీపీ విప్ పలివెల మధు, నాయకులు ఏలేటి గంగరాజు, మాకన మాలయ్య శుక్రవారం డిమాండ్ చేశారు. ప్రజలు అధికారాన్ని ఇచ్చింది అంబేడ్కర్ రాజ్యాంగ పరిధిలో పాలన చేసేందుకన్న విషయాన్ని ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. రాష్ట్ర వాణిజ్య కేంద్రమైన విజయవాడ నడిబొడ్డులో ప్రతిష్ఠించిన మహనీయుడు అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం యావత్ దేశమూ విస్తుపోతోందన్నారు. కూటమి ప్రభుత్వం దీనికి బాధ్యత వహించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు 12 నుంచి ఓరియంటేషన్

రాయవరం: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి శుక్రవారం విలేకరులకు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో 2024-25 ఆర్థిక సంవత్సరం కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

అందుబాటులో ఎరువులు

కె.గంగవరం: మండలంలో ప్రైవేట్ డీలర్లు, సొసైటీల వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బలుసు రవి తెలిపారు. కె.గంగవరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ డీలర్ల వద్ద 506 టన్నులు, సొసైటీల వద్ద 518 టన్నుల ఎరువులు ఉన్నాయన్నారు. రైతులు డీఏపీ మాత్రమే కాకుండా కాంప్లెక్స్ ఎరువులను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. నాట్లు వేసిన 30 రోజుల తరువాత పాస్ఫేట్ ఎరువులు వరికి ఉపయోగపడవని రైతులు గుర్తించి యూరియా, పొటాష్ మాత్రమే వేయాలన్నారు. ప్రైవేట్ డీలర్లు ఎరువులకు లింక్ పెట్టి పురుగు మందులు, ఇతర సూక్ష్మ పోషకాలు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఇకపై ఇలాంటివి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

మండపేట: తెలుగు సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలను పట్టణంలో శుక్రవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మహేష్‌బాబు టౌన్ వైడ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ మెండు సత్తిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం మహేష్ బాబు పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక మయూరి వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. తొలుత వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంచి పెట్టారు. అనంతరం వారికి భోజనాలు వడ్డించారు. సంస్థ నిర్వాహకుడు ఇన పకోళ్ల సత్యనారాయణ, రిమ్మలపూడి రాజు చేతుల మీదుగా వృద్ధులకు బిస్కెట్ పాకెట్స్ పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో అనాథలకు, నిరుపేదలకు, యాచకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. 200 మందికి ఆహార పొట్లాలు అందించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల రాంబాబు, పోలుబోతు గణేష్, మెండు రవిచంద్ర, మెండు మహేష్, ఎస్ బాజీ, కలీం, ఎస్‌కే తాజుద్దీన్, రగడ, తిప్పా ప్రసాద్ అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

అష్టకష్టాలు పడినారు



ఎగువ ప్రాంతాల నుంచి ఆటోలపై తెచ్చిన వరి నారును దించుతున్న రైతులు



గొల్లపాలెంలో వెదజల్లిన పొలంలో నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన నారు

- ఖరీఫ్ ఆరంభంలోనే వానలు
- పొలాల్లో నిలిచిపోయిన నీరు
- నారు కొరతతో రైతుల ఇక్కట్లు

కాజులూరు: ప్రకృతి కన్నెర్రజేసింది.. పుడమి పుత్రులను నిండా ముంచింది.. ఆదిలోనే కష్టాలు తెచ్చింది.. ఆగస్టు రెండో వారం వచ్చినా రామచంద్రపురం నియోజకవర్గంలో నేటికీ వరి నాట్లు వేసే ప్రక్రియ సాగుతోంది. విత్తనాలు సక్రమంగా మొలవక, నారు కొరత తలెత్తటంతో నాట్లు ఆలస్యమయ్యాయి. దీనికి వర్షాలతో ఇబ్బంది వచ్చింది. నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 65 వేల ఎకరాల్లో సాగు భూమి ఉంది. ఈ ఖరీఫ్‌లో 52 వేల ఎకరాల్లో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. కొందరు వెదజల్లే విధానాన్ని అవలంబించగా, ఇంకొందరు నాట్లు వేస్తున్నారు. గత నెల చివరి వారంలో కురిసిన వర్షాలు నియోజకవర్గంలో నారుమడులు వేసిన రైతులను తీవ్ర నష్టాలకు గురిచేశాయి. వర్షాలు కురిసే సమయానికి దాదాపు అన్ని గ్రామాల్లోనూ రైతులు నారు వేసి, వెదజల్లి ఉన్నారు. వానలకు నీరు పొలాల్లో నిలిచిపోవడంతో విత్తనాలు చల్లిన పొలాల్లో మొలకల దశలో ఉన్న నారు కుళ్లిపోయింది. వెదజల్లిన పొలంలో మొక్క సరిగ్గా మొలకెత్తక మధ్య మధ్యలో నాట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది నారు కొరతకు కారణమైందని రైతులు అంటున్నారు. వేసుకున్న నారు సరిపోక రైతులు నారును కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అక్కడక్కడ రైతులకు నారు సరిపడకపోగా కొందరు రైతులకు ఎక్కువయ్యేది. దీంతో ఒకరికి ఒకరు సర్దుబాటు చేసుకునేవారు. ప్రస్తుతం అధిక శాతం రైతులకు నారు కొరత ఏర్పడడంతో స్థానికంగా నారు దొరకని పరిస్థితి ఏర్పడింది. రైతులు ఎగువ ప్రాంతం నుంచి నారు కొనుగోలు చేసుకుని తీసుకు వస్తున్నారు. ఎకరానికి సరిపడా నారు రవాణా ఖర్చులతో కలిపి సుమారు రూ. ఆరు వేలు దాటుతుందని రైతులు చెబుతున్నారు. తిరిగి నారు వేసి అది ఎదిగిన తరువాత నాట్లు వేద్దామనుకున్నా ఇప్పటికే ఆలస్యమైందని, దానికితోడు మార్కెట్‌లో నాణ్యమైన విత్తనం దొరకటం లేదని రైతులు అంటున్నారు. దీంతో అధిక వ్యయం అవుతున్నా నారు కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందంటున్నారు. ఈ ఏడాది కూలీ రేట్లు అధికంగా ఉండడంతో నాట్ల దశలోనే వరి సాగుకు భారీ ఖర్చు చేయాల్సి వస్తుందని, నారు కొరత తమను మరింత ఇబ్బందులకు గురిచేస్తుందని రైతులు వాపోతున్నారు.

గింజ కుళ్లిపోయింది..



ఈ ఏడాది తొలి దశ నుంచి రోజూ ఏదో సమయంలో వర్షం పడుతూనే ఉంది. వర్షాలు కురిసే సమయానికి కొందరు నారు వేసి, మరికొందరు వెదజల్లారు. వర్షపునీరు పొలాల్లో నిలిచిపోవడంతో నారు, వెదజల్లిన పొలాల్లో మొలకల దశలో ఉన్న వరి గింజ కుళ్లిపోయి నారు కొరత ఏర్పడింది.

– పితాని సత్యనారాయణ, రైతు, తణుకువాడ

ఆర్థిక భారం పెరిగింది



ఈ ఏడాది తొలకరి సాగులో రైతులకు ఆర్థిక భారం పెరిగింది. వరుస వానలతో నారు కొరత ఏర్పడగా రెండో సారి నారు చల్లుదామనుకున్నా విత్తనాల కొరత వేధిస్తోంది. దానికితోడు ప్రభుత్వం నుంచి రైతు భరోసా సొమ్ము అందకపోవడంతో పెట్టుబడులు లేక సాగు ముందుకు సాగడం లేదు.

– చిర్ల వెంకటరెడ్డి, రైతు, బందనపూడి

తహసీల్దార్లుగా బాధ్యతల స్వీకరణ



తేజేశ్వరరావు



ఐపీ శెట్టి



తహసీల్దార్ సూర్యారావుకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న వీఆర్వోలు

మండపేట: స్థానిక తహసీల్దార్‌గా పి.తేజేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎన్నికల విధులు నిర్వహించేందుకు కృష్ణా జిల్లా నుంచి వచ్చిన సురేష్‌కుమార్ బదిలీపై ఆయన సొంత జిల్లాకు వెళ్లారు. తేజేశ్వరరావు గతంలో కోటనందూరు, ముమ్మిడివరం కార్యాలయాల్లో పనిచేసి, అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో ఏవోగా విధులు నిర్వహించారు. తర్వాత చింతూరులో పనిచేసి రామచంద్రపురం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. కొత్తగా విధుల్లో చేరిన తేజేశ్వరరావుకు కార్యాలయ సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికి పుష్పగుచ్ఛాలు అందించారు. డిప్యూటీ తహసీల్దార్ అశోక్, ఆర్ఐ కంతంశెట్టి గౌరి, వీఆర్వోలు ఆయనకు స్వాగతం పలికారు.

రాయవరం తహసీల్దారుగా ఐపీ శెట్టి

రాయవరం: స్థానిక తహసీల్దార్‌గా ఐపీ శెట్టి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలమూరు తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తూ ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట తహసీల్దార్‌గా వెళ్లారు. ఇప్పటి జరుగుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా ఐపీ శెట్టి రాయవరం తహసీల్దారుగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఐపీ శెట్టి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. తహసీల్దారును డిప్యూటీ తహసీల్దారు కె.జానకిరామయ్య, ఆర్ఐ పంపన రామారావు, వీఆర్వోలు, వీఆర్ఏలు మర్యాదపూర్వకంగా కలిశారు.

కె.గంగవరం తహసీల్దార్‌గా సూర్యారావు

కె.గంగవరం: మండల తహసీల్దార్‌గా కె.సూర్యారావు నియమితులయ్యారు. ఎన్నికల ముందు బదిలీపై కపిలేశ్వరపురం నుంచి పశ్చిమగోదావరి బదిలీపై వెళ్లిన సూర్యారావు ఎన్నికల అనంతరం కె.గంగవరం వచ్చారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సూర్యారావును వీఆర్వోల సంఘం అభినందించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షేమ ఫలాలు పేదలకు అందాలి



మాతృ వియోగంతో ఉన్న మాచారెడ్డిని పరామర్శిస్తున్న సూర్యప్రకాష్

కాజులూరు: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదలకు అందినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మొగలిపాలెంలో మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నల్లమిల్లి మాచారెడ్డి, అతని కుటుంబ సభ్యులను సూర్యప్రకాశ్ పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఆయన కార్యకర్తలను కలుసుకుని ప్రజా సమస్యలపై చర్చించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. మత్స్యకార భరోసా, రైతుభరోసా, అమ్మ ఒడి తదితర పథకాలు అందించలేదన్నారు. ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకపోవటంతో పేదలకు వైద్యం అందడం లేదన్నారు. ఆర్ఎంసీ మాజీ డైరెక్టర్ నల్లమిల్లి ఈశ్వరరెడ్డి, గొల్లపాలెం ఎంపీటీసీ జొన్నకూటి పద్మజా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పోతురాజు బాబూరావు, రేఖపల్లి సత్తిబాబు, మండ గోవిందురెడ్డి, చింతా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

'యల్లాప్రగడ'కు పీఎంపీల నివాళి



యల్లా ప్రగడ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న పీఎంపీలు

మండపేట: వైద్య శాస్త్రంలో ప్రసిద్ధి చెందిన గొప్ప వ్యక్తి యల్లాప్రగడ సుబ్బారావు అని పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం యల్లాప్రగడ సుబ్బారావు 76 వర్ధంతిని నిర్వహించారు. టౌన్ హాల్ వద్ద గల ఉషా క్లినిక్ ఆవరణలో యల్లాప్రగడ చిత్రపటం వుంచి పీఎంపీలు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ వైద్య శాస్త్రంలో అనేక పరిశోధనలు చేసి అద్భుతమైన మందులను కనుగొన్న గొప్ప శాస్త్రజ్ఞుడు యల్లాప్రగడ రు. రక్త హీనత వల్ల కలిగే రోగాలకు ముందుగానే మందు కనిపెట్టారన్నారు. క్షయ రోగ నివారణకు బసోనికోటి నికాసిడ్, హైడ్రాక్సైడ్ మందులను కూడా ఆయనే కనుగొన్నారన్నారు. బోదకాలు, టైఫాయిడ్, పాండురోగం వంటి వ్యాధుల నిర్మూలనకు ఔషధాలను కనిపెట్టి మానవ సమాజానికి అందించిన మహోన్నతమైన వ్యక్తి యల్లాప్రగడ అని కొనియాడారు. కార్యక్రమంలో సంపర రాఘవేంద్ర, వాసపల్లి వంశీ, గాలింకి నాగేశ్వరరావు, పి. చిన్నారావు, గంటి వీచ చిన బాబు, వి.నరేష్‌కుమార్, ఎస్‌కే బాజీ, మండిపూడి చంద్రశేఖర్, పలువురు పీఎంపీలు పాల్గొన్నారు.

స్వల్ప పెట్టుబడితో అధిక దిగుబడులు లక్ష్యం

'ఆత్మ' ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి



పొలంబడిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న ఆత్మ పీడీ జ్యోతిర్మయి, వ్యవసాయ అధికారులు

రాయవరం: శాస్త్ర సాంకేతిక పద్ధతులను ఉపయోగించి రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడి సాధించేలా తీర్చిదిద్దడమే 'ఆత్మ' ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని చెల్లూరు గ్రామంలో ఆత్మ సౌజన్యంతో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఆత్మ సౌజన్యంతో రైతులకు శిక్షణ, ప్రదర్శన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, ద్రవరూప జీవన ఎరువుల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే భాస్వరానికి బ్యాక్టీరియా, పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా గురించి వివరించారు. వాటిని ఎకరానికి 500 మిల్లీలీటర్ల పశువుల ఎరువు లేదా సేంద్రియ ఎరువుతో కలుపుకొని విత్తనం నాటేటప్పుడు కానీ లేదా వారం రోజుల్లో పొలంలో చల్లుకోవాలన్నారు. ఆలమూరు ఏడీఏ నాగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబరు 15వ తేదీలోగా రైతులు విధిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు వలన కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ ఎరువుల యాజమాన్యం గురించి మాట్లాడుతూ భూమిలోని పోషకాలు తెలుసుకునేందుకు విధిగా మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వచ్చే పురుగులు, తెగుళ్ల గురించి వివరిస్తూ, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాబురావు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం తయారీ విధానం గురించి వివరించారు. అనంతరం మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించిన పొలంబడిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు చుండ్రు వీర్రాజు, ముత్యాల పెదపూడి, దేవు శ్రీను అధిక సంఖ్యలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జగన్ పేరు తొలగింపు దారుణం



మీడియాతో మాట్లాడుతున్న వెంకన్నబాబు

మండపేట: విజయవాడ నడిబొడ్డున నిర్మించిన బాబా సాహెబ్ అంబేడ్కర్ భారీ విగ్రహం కింద మాన్యుమెంట్‌పై ఉన్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరును ఏపీఐఐసీ శాఖ ఆధ్వర్యంలో తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు ఖండించారు. శుక్రవారం విజయలక్ష్మి నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకన్నబాబు మాట్లాడారు. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేరును తొలగించడం కోడ్ ఆఫ్ కాండక్టుకు విరుద్ధమన్నారు. అంబేడ్కర్ మహాశిల్పం వద్ద రాత్రి వేళ లైట్లు ఆర్పేసి మరీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరు తొలగించడం ప్రభుత్వ కక్షగా అభివర్ణించారు.

ఇస్లాం అంతానికే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు

అలీఖాన్‌బాబా ఆగ్రహం



మండపేట: పార్లమెంటులో ఎన్డీయే కూటమి వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టి ముస్లింల మనోభావాలను దెబ్బతీసిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు అధికారాలను తగ్గించి బోర్డులో ఇతరులకు అధికారాలు కట్టబెట్టడం కేంద్ర ప్రభుత్వ కుట్ర అని ఆరోపించారు. వక్ఫ్ బోర్డుపై జిల్లా కలెక్టర్ అజమాయిషీ అంటే అదొక వివాదాస్పద అంశం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు వల్ల దేశంలోని ముస్లింలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవరణ వల్ల ముస్లిం సమాజం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇస్లాంను పూర్తిగా అంతమొందించాలన్న లక్ష్యంతో ఈ అంశాన్ని తెరమీదకు తెచ్చి వివాదాస్పదంగా మార్చారని విమర్శించారు. స్వతంత్రంగా ఉన్న వక్ఫ్‌బోర్డు అన్యాక్రాంతం అయిపోతుందని ఆవేదన వ్యక్త చేశారు. ఈ బిల్లును పార్లమెంటులో విపక్షాలు కూడా ఖండించిన విషయాన్ని షేక్ అలీఖాన్‌బాబా గుర్తు చేశారు. ఇస్లాంకు వ్యతిరేకంగా వున్న బిల్లును తక్షణమే విరమించుకుని ముస్లింల మత స్వాతంత్ర్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ఘటన బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

వరలక్ష్మీ ప్రణమామ్యహం



అప్పనపల్లిలో సామూహిక వ్రతాల్లో మహిళలు

మామిడికుదురు: శ్రావణ మాసంలో మొదటి శుక్రవారాన్ని భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కోలాహలంగా మారింది. ఇందులో భాగంగా అమ్మవారి కలశ స్థాపన, శోడషోపచార పూజ, తోరగ్రంధి పూజ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలను ఆలయ అర్చకులు, వేద పండితులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, జ్యోత్సుల సోమయాజులు జరిపించారు. ఆలయ ఈఓ జి.మాధవి పర్యవేక్షణలో సామూహిక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి, రూపు అందజేశారు.

అన్నపూర్ణాదేవికి కుంకుమ పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువైన అన్నపూర్ణాదేవి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అర్చకుడు అల్లవరపు సూరిబాబు ఆధ్వర్యంలో సహస్ర కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అలాగే క్షణముక్తేశ్వర స్వామి, కనకదుర్గ ఆలయాల్లో శ్రావణ మాస పూజలు జరిగాయి.

అంబాజీపేట: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అంబాజీపేట, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, ఇరుసుమండ, ముక్కామల తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించారు.

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలోని ఉపాలయంలో కొలువైన రాజ్యలక్ష్మి తాయారు సన్నిధిలో సామూహిక వరలక్ష్మి పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ నేతృత్వంలో మహిళలు పూజలు చేశారు. దేవస్థానం తరపున అమ్మవారి రూపు, పూజా సామగ్రి ఉచితంగా అందజేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్ దర్శనం, ప్రసాద వితరణ చేసి, నిత్యాన్నదాన పథకంలో భోజన వసతి కల్పించారు.

అంబేడ్కర్ విగ్రహంపై అక్కసు ఆటవిక చర్య



ముసునూరి వెంకటేశ్వరరావు

కొత్తపేట: అంబేడ్కర్ విగ్రహంపై అక్కసు వెళ్లగక్కుతూ పచ్చ మూకలు చీకటి దాడి చేయడం ఆటవిక చర్య అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మాజీ ప్రచార కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పంపై సుత్తులు, ఇతర పరికరాలతో దాడి, మహాశిల్పం బోర్డు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును చీకటి మాటున పచ్చ మూకలు ధ్వంసం చేయడాన్ని ముసునూరి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన మరుక్షణం నుంచీ సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడితే, ఈ ఏడాది చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన ప్పటి నుంచీ వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు శ్రీకారం చుట్టారన్నారు. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఆందోళన కలిగిస్తుందన్నారు. సీఎం చంద్రబాబుకు గాని, ఆ ప్రభుత్వానికి గాని ఎప్పుడూ అంబేడ్కర్ అన్నా.. దళిత జాతి అన్నా గౌరవం లేదన్నారు.

తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా శ్రీధర్



తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీధర్, ఇతర కార్యవర్గ సభ్యులు

రామచంద్రపురం: స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సర్వ సభ్య సమావేశం సంఘ మాజీ అధ్యక్షుడు నరాల ఏడుకొండలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా దొంగల శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కె.గంగవరం మండలానికి చెందిన పంపన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కాజులూరు మండలానికి చెందిన పెంకే విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కోట శ్రీనివాసరావు మిగతా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మాజీ సంఘ ప్రధాన కార్యదర్శి పలివెల నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు, సంఘ సభ్యులు కంచి సత్యానందం, పాలిక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో రికార్డుల పరిశీలన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఈఓపై మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు వచ్చినట్లు దేవదాయ శాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ద్రాక్షారామ శ్రీపైండా అన్నసత్రంలో భీమేశ్వరస్వామి ఆలయం విషయంలో ప్రజల నుంచి బహిరంగంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆరుగురు సభ్యులతో కమిటీ వేశామన్నారు. ఈ కమిటీతో కలసి రికార్డులు పరిశీలించనున్నట్లు తెలిపారు.

మహిళా సాధికారతకు చొరవ

రామచంద్రపురం: మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అమలు చేస్తున్నాయని కూటమి నేతలు అన్నారు. స్థానిక నాలుగో వార్డు డ్వాక్రా సంఘాల మెప్మా సమావేశం శుక్రవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ట్రేడర్స్ కన్వీనర్ కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్ నాయుడు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

కె.గంగవరం: మండలంలో ప్రైవేట్ డీలర్లు, సొసైటీల వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బలుసు రవి తెలిపారు. కె.గంగవరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ డీలర్ల వద్ద 506 టన్నులు, సొసైటీల వద్ద 518 టన్నుల ఎరువులు ఉన్నాయన్నారు. రైతులు డీఏపీ మాత్రమే కాకుండా కాంప్లెక్స్ ఎరువులను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. నాట్లు వేసిన 30 రోజుల తరువాత పాస్ఫేట్ ఎరువులు వరికి ఉపయోగపడవని రైతులు గుర్తించి యూరియా, పొటాష్ మాత్రమే వేయాలన్నారు. ప్రైవేట్ డీలర్లు ఎరువులకు లింక్ పెట్టి పురుగు మందులు, ఇతర సూక్ష్మ పోషకాలు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఇకపై ఇలాంటివి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు




వల్లూరు హైస్కూల్ ఆవరణలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

కపిలేశ్వరపురం: బాల్యవివాహాల రద్దు చట్టం 2006 ప్రకారం 18 ఏళ్ల లోపు యువతులకు వివాహాలు చేస్తే చట్ట పరిధిలో కఠినంగా శిక్షిస్తారని బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండలంలోని వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సచివాలయ ఉద్యోగులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. బాలల రక్షణకు కృషి చేస్తామంటూ మానవహారంగా నిలుచుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ గెద్దం ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

మలికిపురం: స్థానిక విశ్వేశ్వరాయపురం బంక్‌లో పెట్రోలు నింపుకొని రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో మోటారు సైకిల్ కింద భాగం నుంచి ఒక్కసారిగా మంటలు రేగాయి. దానిని వదిలేసి ఆ వాహనదారుడు పరుగు పెట్టాడు. స్థానికులు వెంటనే మంటలను అదుపు చేశారు. ఈ వాహనం రామరాజులంక గ్రామానికి చెందిన శెట్టిం మహేష్‌కు చెందినదిగా గుర్తించారు.

గోధుమ తాచు హల్‌చల్



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ వర్మ

అంబాజీపేట: మాచవరం డైలీ మార్కెట్ వెనుక ఉన్న వెలవలి రామారావు ఇంటి ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ఆరు అడుగుల గోధుమ తాచు హల్‌చల్ చేసింది. దీంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం అందించారు. అక్కడకు వర్మ చేరుకుని తాచుపామును పట్టుకున్నారు. అనంతరం ప్లాస్టిక్ బాటిల్‌లో బంధించి జన సంచారం లేని ప్రాంతంలో వదిలిపెట్టారు.